ప్రజాశక్తి
ఆదివారం 30 ఏప్రిల్ 2023
5
విజయనగరం



కన్యా స్థూపాన్ని ఆవిష్కరించిన కోలగట్ల

విజయనగరం టౌన్ : నగరంలోని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ సెంటర్లో ప్రతిష్టాత్మక కన్యా స్తూపాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఆవిష్కరించారు. శ్రీ జైన్ శ్వేతాంబర్ మహిళా మండలి ఆధ్వర్యంలో కన్యా స్తూపాన్ని ఏర్పాటు చేశారు. దేశవ్యాప్త నినాదమైన బేటి బచావో, బేటి పడావో కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో తొలిసారిగా కన్యా స్తూపాన్ని నగరంలో ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా శ్రీ జైన్ శ్వేతాంబర్ మహిళా మండలి అధ్యక్ష, కార్యదర్శులు రీటా అంచాలియా, కమలా హీరావత్ మీడియాతో మాట్లాడుతూ ఈ స్థూపాల సారాంశం ఆడపిల్లలను రక్షించుకోవడం, చదివించుకోవడం అందరి బాధ్యత అని తెలిపారు. మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, స్థానిక కార్పొరేటర్ పిల్లా రాధా భవాని, జోనల్ ఇంచార్జ్ ముచ్చు శ్రీనివాసరావు, సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అంచాలయ, ఆర్‌కె జైన్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని 21వ డివిజన్ మేకల కమేళా నుండి జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్లపాల్గొన్నారు. స్థానిక సమస్యలను ఆయన దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, కార్పొరేటర్ కనకల నాగవల్లి పాల్గొన్నారు.

తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు పనులు (ఫైల్)

పారిశ్రామిక అవసరాలకు కీలకం.. రామతీర్థసాగర్

ఒకవైపు వ్యవసాయ రంగానికి ఊతమిస్తూనే... జిల్లాను పారిశ్రామిక ప్రగతి వైపు పరుగులు పెట్టించే ప్రాజెక్టు తారకరామ తీర్థసాగర్ జలాశయం. సుమారు 24,700 ఎకరాలకు సాగునీరు, విజయనగరం నగరానికి తాగునీరు అందించడమే కాకుండా, జిల్లా అభివృద్ధికి ఎంతో కీలకమైన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నీటి అవసరాలను కూడా ఈ ప్రాజెక్టు తీర్చనుంది. ఇతర పారిశ్రామిక అవసరాలకు కూడా ఈ ప్రాజెక్టు నుంచి నీటిని సరఫరా చేయనున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ రామతీర్థసాగర్ ప్రాజెక్టు పెండింగ్ పనులను రూ.194.40 కోట్లతో పూర్తి చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మే 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ఈ పెండింగ్ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

- సాగు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు కీలకంగా తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు
- రూ.194.40 కోట్లతో పెండింగ్ పనులు
- 3న శంకుస్థాపన చేయనున్న సిఎం

ప్రజాశక్తి-విజయనగరం

జలయజ్ఞంలో భాగంగా 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జిల్లాలో సుమారు 24,710 ఎకరాలకు సాగునీరు అందించేందుకు గుర్ల మండలం కొండగండ్రేడు గ్రామం వద్ద చంపావతి నదిపై తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టును ప్రతిపాదించారు. ఈ మేరకు అదే ఏడాది ఫిబ్రవరి 19న ప్రాజెక్టును ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ద్వారా 16,538 ఎకరాల కొత్త ఆయుకట్టుకు సాగునీరు, 8,172 ఎకరాల ఆయుకట్టుకు స్థిరీకరణ జరుగుతుంది. చంపావతి నదిపై కొండగండ్రేడు గ్రామం వద్ద బ్యారేజీని నిర్మించి, అక్కడినుంచి కుమిలి గ్రామం వద్ద సుమారు 2.7 టిఎంసిల సామర్థ్యంతో, మూడు డైకులతో కలుపుకొని మట్టికట్టతో నిర్మించే జలాశయానికి నీటిని మళ్లించాలన్నది ప్రాజెక్టు స్వరూపం. నీటిని మళ్లించేందుకు మధ్యలో కొండను తొలిచి సొరంగాన్ని కూడా తవ్వాల్సి ఉంది. కుడి, ఎడమ కాలువల ద్వారా ఆయుకట్టుకు సాగునీరు అందనుంది.

చివరిదశకు చేరిన భూసేకరణ

సాగు, తాగునీటి అవసరాలను తీర్చే ఈ బహుళ ప్రయోజన ప్రాజెక్టుకు తొలుత సుమారు రూ.220.04 కోట్ల అంచనా వ్యయంతో 2005లో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వివిధ కారణాల వల్ల ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కావడంతో అంచనా వ్యయం భారీగా పెరిగింది. దీంతో ప్రాజెక్టు వ్యయాన్ని 2015లో రూ.471.31 కోట్లకు సవరించగా, రెండోసారి 2020లో రూ.739.90 కోట్లకు సవరించారు. ప్రాజెక్టుకు సుమారు 3,600 ఎకరాలు భూ సేకరణ చేయాలి. కానీ, ఇప్పటివరకు 3,454 ఎకరాల సేకరణకు ప్రతిపాదించి, 3,265 ఎకరాలను సేకరించారు. మరో 189 ఎకరాల భూసేకరణ ఇంకా చేపట్టాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు ప్రభావిత గ్రామాలు కోరాడపేట, ఎ.టి.అగ్రహారం, పడాలపేట గ్రామాలకు ఇప్పటికే ఆర్ఆర్ ప్యాకేజీని వర్తింపజేశారు. సారిపల్లి, నీలంరాజుపేట గ్రామాలను కూడా ప్రభావిత గ్రామాలుగా గుర్తిస్తూ ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేశారు.

భోగాపురం ఎయిర్‌పోర్టుకు 5 ఎంఎల్‌డి

ఇప్పటివరకు సుమారు 41 శాతం పనులు పూర్తికాగా, ఈ ప్రాజెక్టును 2024 డిసెంబరుకు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇప్పటివరకు ప్రాజెక్టు, భూసేకరణ, పునరావాసం తదితర పనుల కోసం సుమారు రూ.284.27 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. ప్రాజెక్టు పూర్తయితే, పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ మండలాల్లోని 49 గ్రామాలకు చెందిన 24,710 ఎకరాలకు సాగునీరు అందుతుంది. విజయనగరం కార్పొరేషన్ ప్రజల దాహార్తిని తీర్చేందుకు 0.48 టిఎంసిల నీటిని సరఫరా చేయనున్నారు. భోగాపురంలో ప్రతిపాదిత అంతర్జాతీయ విమానాశ్రయానికి, నిర్వాసిత కాలనీలకు రోజుకు 5 ఎంఎల్‌డిల నీటిని సరఫరా చేయనున్నారు. ఈ ప్రాంతంలో భవిష్యత్తులో వచ్చే పరిశ్రమలకు కూడా ఈ ప్రాజెక్టు ద్వారా నీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు. తద్వారా జిల్లా పారిశ్రామిక రంగానికి కూడా ఈ ప్రాజెక్టు ఎంతో ఊతమిస్తుంది. జ్యుడీషియల్ రివ్యూ అనంతరం ప్రాజెక్టు మిగిలిన పనులను రూ.194.40 కోట్లతో నిర్వహించేందుకు గతేడాది సెప్టెంబర్ 26న ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తండ్రి వైఎస్ఆర్ హయాంలో నిర్మాణం ప్రారంభమైన తారకరామ తీర్థసాగర్‌ను పూర్తి చేసేందుకు సిఎం జగన్ ముందుకొచ్చి మే 3న శంకుస్థాపన చేయనున్నారు.

జెఇఇ మెయిన్స్‌లో మెరిసిన విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. పలువురు విద్యార్థులు వందలోపు ర్యాంకు సాధించి విద్యలనగరం సత్తాచాటారు. విజయనగరానికి చెందిన ఎస్.మౌనిష నాయుడు ఆలిండియా ర్యాంకు 142, ఒబిసి ర్యాంకు 28 సాధించింది. ఎల్.లావణ్య ఆలిండియా ర్యాంకు 349, ఒబిసి 55, సిహెచ్‌వి యశ్వంత్ ఆలిండియా ర్యాంకు 785, ఒబిసి 130 ర్యాంకు సాధించారు. బొబ్బిలికి చెందిన మరడాన అనుశ్రీ ఆలిండియా ర్యాంకు 147, ఒబిసి 70వ ర్యాంకు, కె.వంశీకృష్ణ ఆలిండియా ర్యాంకు 814, ఒబిసి 137 ర్యాంకు సాధించారు. విజయనగరం తోటపాలెం వైఎస్ఆర్ కాలనీకి చెందిన పతివాడ సాత్విక్ 98.37 పర్సంటేల్‌తో 4650వ ర్యాంకు సాధించాడు.

శృంగవరపుకోట :జామి మండలం తానవరం గ్రామానికి చెందిన వర్రి హోమప్రమోద్ ఓపెన్ కేటగిరిలో 332 ర్యాంకు, ఒబిసి కేటగిరిలో 50వ ర్యాంకు సాధించాడు. విశాఖలోని నారాయణ కళాశాలలో చదువుకున్న ప్రమోద్ అడ్వాన్సు పరీక్షలు మంచి ర్యాంకు సాధించి ఐఐటి ఢిల్లీలో బిటెక్ కంప్యూటర్ చదువుతానని తెలిపాడు.

బలిజిపేట మండలంలోని అరసాడకు చెందిన వంగపండు సాయి సూర్య ప్రకాష్‌కు శనివారం వెలువడిన జెఇఇ మెయిన్స్‌లో ఓపెన్ కేటగిరిలో 72వ ర్యాంకు, ఒబిసి కేటగిరిలో 11వ ర్యాంకు సాధించాడు. గతంలో కూడా జెఇఇ మెయిన్స్ ఆర్కిటిక్‌లో 99.973 మార్కులతో ఆలిండియా విభాగంలో 2వ ర్యాంకు సాధించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు వెంకటనాయుడు, మోహిని కుమారుడిని అభినందించారు. ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

సత్తాచాటిన చైతన్య విద్యార్థులు

విజయనగరంలోని శ్రీచైతన్యకళాశాలలో పలువురు విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని కళాశాల డీన్ ఎ.శ్రీనివాసనాయుడు, ప్రిన్సిపాల్ ఆర్.శ్రీధర్ తెలిపారు. నడుపూరు శ్రీనివాస్ 99.13 పర్సంటేల్, సారికి భరత్‌కుమార్ 98.49 పర్సంటేల్ సాధించారు. 21మంది విద్యార్థులు 94 పర్సంటేల్‌పైన సాధించారు. ఈ సందర్భంగా వీరిని డీన్, ప్రిన్సిపాల్, ఎఒ మధుసూదనరావు అభినందించారు.

సాలూరు: పట్టణానికి చెందిన విద్యార్థి ఉప్పల వెంకట విష్ణువర్ధన్ రాజు జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించాడు. విశాఖపట్నంలోని శ్రీ విశ్వ కాలేజీలో చదువుకున్న విష్ణువర్ధన్‌రాజు జెఇఇ మెయిన్స్‌లో 99.91శాతం సాధించాడు. ఓపెన్ కేటగిరీలో 1128,ఇడబ్ల్యుసి కేటగిరీలో 113ర్యాంక్ సాధించాడు.పట్టణంలో వ్యాపారి ఉప్పల తాతాజీ కుమారుడు. ఉత్తమర్యాంకు సాధించడంపై ఆయన కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

దాక్షిణ్యకు జెఇఇలో 2284 వ ర్యాంకు

నెల్లిమర్ల :మండలంలోని గరికిపేట గ్రామానికి చెందిన మహంతి దాక్షిణ్య జెఇఇ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చింది. ఈమె ఒబిసి కేటగిరిలో 2284వ ర్యాంకు సాధించి సత్తా చాటుకుంది. తల్లిదండ్రులు వెంకటరావు, శ్రీదేవితో పాటు గ్రామస్తులు ఆమెకు అభినందనలు తెలిపారు. దాక్షిణ్య తండ్రి వెంకటరావు ఎల్ఐసి ఏజెంటు కాగా తల్లి శ్రీదేవి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. దాక్షిణ్య విశాఖపట్నంలోని శ్రీచైతన్య కళాశాలలో చదువుతున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు

సత్తా చాటిన వీరఘట్టం కుర్రోళ్లు

వీరఘట్టం : జెఇఇ మెయిన్స్ ఫలితాలు బుధవారం వెలువడడంతో వీరఘట్టానికి చెందిన ముగ్గురు కుర్రోలు తమ సత్తా చాటుకున్నారు. ఇందుకు సంబంధించి వారణాసి దీపేస్ 99.97, వడ్డాది శ్రీసూర్య గుణవంత్ 99.68, మజ్జి యువరాజు 98.698 మార్కులతో ఉత్తీర్ణత సాధించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సూర్యప్రకాశ్ 72వ ర్యాంకు

ప్రమోద్ 332వ ర్యాంకు

దాక్షిణ్య 2284వ ర్యాంకు

దీపేష్ (99.97)

శ్రీసూర్య (99.68)

ఎన్.శ్రీనివాస్(99.13పర్సంటైల్)

మోడీని గద్దె దించండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-గరివిడి

దేశ రక్షణకు మోడీని గద్దె దించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. గరివిడిలో శనివారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం నుంచి ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు పరిరక్షణ కోసం, ప్రజాతంత్ర హక్కుల కోసం వామపక్షాలు పోరాడుతున్నయని అన్నారు. నాడు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి అనేకమంది త్యాగ ధనులు స్వాతంత్ర్యాన్ని సాధిస్తే నేడు మోడీ ఆ స్వాతంత్రాన్ని విదేశీ కంపెనీలకు తాకట్టు పెట్టారని ఆయన విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకపోగా ఉత్తరాంధ్ర జిల్లాలకు తల మానికంగా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ ను అమ్మేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంలో దేశాన్ని అధోగతి పాల్జేసిందన్నారు. దేశంలో బిజెపిని గద్దె దించకపోతే ప్రజాస్వామ్యం పెద్ద ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, టివి రమణ, నాయకులు అంబళ్ళ గౌరి నాయుడు, జె. విశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : కేంద్రంలో బిజెపి అమలు చేస్తున్న విధానాలతో దేశ ప్రగతికి నష్టం జరుగుతుందనివై. వెంకటేశ్వరరావు అన్నారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్షాలు చేపట్టిన ప్రచారభేరిలో భాగంగా గంటి ప్రసాదం భవనంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజి ఇవ్వకపోయినా వైసిపి, టిడిపి నాయకులు నోరెత్తకపోవడం దుర్మార్గమన్నారు. ప్రశ్నించేందుకే పార్టీ పెట్టానని చెబుతున్న జనసేన అధినేత పవన్ బిజెపి వైఫల్యాలను ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.కామేశ్వరరావు, సిపిఎం, సిపిఐ నాయకులు పి.శంకరరావు, ఎస్.గోపాలం, ఎ.ఆనందరావు, ఎం.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గరివిడి : మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వరరావు

ఆర్‌బికె యూనిట్‌గా ఇ-క్రాప్

- విత్తనాలు, ఎరువుల సరఫరా పర్యవేక్షణకు టాస్క్ ఫోర్సు
- ఎఎబి సమావేశంలో విద్యా శాఖామంత్రి బొత్స సత్యనారాయణ
- జూన్ మొదటివారంలో తోటపల్లి నీటిని విడుదల చేయాలి : జెడ్‌పి చైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం

రైతులు సాగుచేస్తున్న భూమిని వర్గీకరించుకొని కోర్ట్ కేసులు ఉన్నవి తప్ప మిగిలినవన్నీ ఇ-క్రాప్ నమోదు చేయాలని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. ఇనాం భూముల్లో పండించినా, దేవాదాయ, డి ఫారం భూముల్లో పండించినా పంట ఉంటే ఇ-క్రాప్ నమోదు కావాలని స్పష్టంచేశారు. రైతు పేరుకు ఎదురుగా పండించే భూమి వివరాలను నమోదు చేయాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం ఎఎబి అధ్యక్షులు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ రెండు గ్రామాల సరిహద్దుల్లో ఉన్న భూములను ఇ-క్రాప్ చేయాల్సి వస్తే సచివాలయ పరిధిని కాకుండా ఆర్‌బికె పరిధిని పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. ఆర్‌బికె పరిధిలో చెల్లింపులన్నీ ఆన్‌లైన్‌లోనే జరగాలని స్పష్టంచేశారు. సీజన్ ప్రారంభానికి ముందే ఎరువులు, విత్తనాలను పొజిషన్ చేసుకోవాలని ఆదేశించారు. సరఫరా సక్రమంగా సాగేలా పర్యవేక్షించడానికి టాస్క్ ఫోర్సు కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మికి సూచించారు.

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ జలాశయాల్లో ఉన్న నీటి నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తోటపల్లి వద్ద ప్రస్తుతం 450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని ఇఇ రామచంద్రరావు వివరించారు. ఆంధ్ర, తాటిపూడిలో కూడా 50 శాతం నీటి నిల్వలే ప్రస్తుతం ఉన్నాయని ఇఇ తెలిపారు. జూన్ మొదటి వారంలో నీటిని విడుదల చేసేందుకు సిద్ధంగా ఉండాలని చైర్మన్ ఆదేశించారు. చివరి భూములకు నీరు అందడం ఆలస్యం కాకూడదని, ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సూచించారు. అనంతరం పట్టు పరిశ్రమ శాఖ ముద్రించిన పట్టుని పెంచుదాం పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. సమావేశంలో ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు ఇందుకూరి రఘురాజు, సురేష్ బాబు, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, కలెక్టర్ నాగలక్ష్మి, జెసి మయూర్ అశోక్, జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ మీనాకుమారి, మార్క్‌ఫెడ్ డిఎం విమల, ఎఎబి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

17న చంద్రబాబు జిల్లా పర్యటన

ప్రజాశక్తి-శంగవరపుకోట

'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా మే నెల 17న టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు శృంగవరపుకోట నియోజకవర్గంలో పర్యటిస్తారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోళ్ల లలితకుమారి తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో ఐదు మండలాల్లోని నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రమణాజీ, టిడిపి నాయకులు కె.శ్రీనివాసు, చెక్కా కిరణ్ కుమార్, ఎ.చెల్లయ్య, వి.బాలఈశ్వర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

సీతం కళాశాల సందర్శన

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజనీరింగ్ కళాశాలలో డాక్టర్ రెడ్డీస్ పారిశ్రామిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు ప్రొఫెసర్ సిహెచ్ శాంతమ్మ శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఆమె విద్యార్థులకు ప్రేరణ కలిగించేలా తన జీవిత అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చించే దమ్ముందా..?

కర్రోతు బంగార్రాజుకు ఎమ్మెల్యే బడ్డుకొండ సవాల్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

అభివృద్ధి గురించి నాతో చర్చించే దమ్ము టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజుకు ఉందా అని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. అలా వదిలేయకండిరా...బాబు, కొంచెం చెప్పండిరా అంటూ ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. శనివారం మండలంలోని కొప్పెర్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాతో పాటు ఈ ప్రాంతంలో అభివృద్ధి అంటే స్వర్గీయ పెనుమత్స సాంబశివరాజు, పతివాడ నారాయణ స్వామి నాయుడు గుర్తుకు వస్తారన్నారు. వారంత రాజకీయ అనుభవం నాకు లేకపోయినా వారి తరువాత అభివృద్ధి అంటే కేరాఫ్ బండుకొండేనని తాను చెప్పవసరం లేదన్నారు. నాలుగు మండలాల్లో ఊరూరూ తిరిగి ప్రారంబోత్సవాలకు వేసిన శిలాఫలకాలపై తన పేర్లు లెక్కపెట్టుకుంటే తాను చేసిన అభివృద్ధి అంటే ఎంటో అర్థమైపోతుందన్నారు. ముందు నీ ఊరుని అభివృద్ధి చేసిందికూడా నేనేనని.. అవునో కాదో మీ అన్నను అడిగితే చెబుతాడని బంగార్రాజును ఉద్దేశించి అన్నారు. రాజకీయ పరిపక్వత లేకుండా అవాకులు చవాకులు పేలితే జనం తిరగబడతారన్నారు. 'మీ ఊరులో రోడ్డేసింది మేము, ఆసుపత్రి, అమ్మవారి గుడి, సచివాలం నిర్మాణం చేసింది మేము' అని గుర్తు చేశారు. ఎంపిపి ఎలా అయ్యావో గుర్తు లేదా అన్నారు. నీకు అంత సత్తా ఉంటే మీ అన్నను మీ ఊరులో సర్పంచిగా ఎందుకు గెలిపించుకోలేకపోయావో చెప్పాలన్నారు. పైరవీలు చేసి, ఇన్‌చార్జి తెచ్చుకున్నంత మాత్రాన ఎమ్మెల్యే అయిపోయానని కలలు కనకన్నారు. 30 వేల ఓట్లుతో నన్ను ఓడిస్తావా? ముందు నువ్వు జనసేనకు ఇవ్వకుండా టికెట్ తెచ్చుకో అప్పుడు నా రాజకీయం అంటే ఏంటో చూపిస్తాను. ప్రస్తుతానికి నువ్వు మండల స్థాయి కార్యకర్తవని గుర్తుంచుకో. సర్పంచి దగ్గర నుండి జెడ్పిటిసి, జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్యేగా రెండు సార్లు చేసిన నేను సంస్కారం లేని నీతో చర్చకు రావాలా.. అంటూ అగ్రహం వ్యక్తం చేసారు. రాజకీయం అంటే ఎయిర్‌పోర్టు భూముల్లో దందాలు చేయడం, గుడిలకు, గోపురాలకు చందాలివ్వడం అనుకుంటున్నావా అని ఎద్దేవా చేశారు. చిన్నా పెద్ద తేడా తెలుసుకోని నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని సూచించారు. ఆయనతో పాటు జెసిఎ కన్వీనర్ మహంతి శ్రీనువాసరావు, వైఎస్ ఎంపిపిలు ఎ. రమేష్, చంటిరాజు, నాయకులు మహంతి జనార్ధనరావు, పుప్పాల లక్ష్మినారాయణ, పిన్నింటి యల్లంనాయుడు, మండలంలోని నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసహనమా? అభద్రతా భావమా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

నిన్న మొన్నటి వరకు గడప గడపకు ప్రభుత్వం, ప్రస్తుతం పార్టీ పరంగా జగనన్నే మా భవిష్యత్తు వంటి కార్యక్రమాల పేరిట వైసిపి ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తోంది. మునుపెన్నడూ లేనంతగా ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలు తిరుగుతున్నారు. తలుపు తట్టని ఇల్లులేదు. ఎండైనా, వానైనా కార్యక్రమం ఆగితే క్షణాల్లో ఇంటలిజెన్సీ రిపోర్టులు పార్టీ అధిష్టానానికి, సిఎం జగన్మోహన్‌రెడ్డి వెళ్తుండడంతో నేతలు పడరాని పాట్లు పడుతున్నారు. ఇంతకు ముందు కేవలం ఎన్నికల నగరా మోగేకే ఇటువంటి పర్యటనలు ఉండేవి. ఈసారి భిన్నమైన రాజకీయ పరిస్థితులు కనిపిస్తుండడంతో రాజకీయ సలహాదారుల సూచనల మేరకు కొన్ని కార్యక్రమాలు చేపడుతోంది. అందులో జగనన్ననే మా భవిష్యత్తు ఒకటి. ఈ కార్యక్రమాల్లో ప్రజల నుంచి తమకు, తమ పార్టీకి సానుకూల స్పందన వస్తుందని చెప్తున్నారు. ఇందులో వాస్తవం ఎంత? అన్నది కాస్త పక్కనబెడితే ఇంటింటికీ వెళ్తున్న కొందరు ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు ప్రజలు స్థానిక సమస్యలపైనా, పథకాలు అందకపోవడంపైనా ప్రశ్నిస్తున్నారు. కొన్నిచోట్ల నిలదీస్తున్నారు. దీనికి సమాధానం చెప్పాల్సిన ఎమ్మెల్యేలు 'చేస్తాం గాబరా ఎందుకు? అంతసీన్ లేదు లే' అంటూ ఎగతాళిగా మాట్లాడడం చర్చినీయాంశంగా మారింది. ఇటీవల బొండపల్లి మండలం వేంద్రం గ్రామంలో ప్రశ్నించిన సాధారణ మహిళపై స్థానిక ఎమ్మెల్యే ఒకింత ఆగ్రహానికి గురయ్యారు. ఈ ఒక్కటే కాదు. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈనేపథ్యంలో ఎమ్మెల్యేలు కేవలం అసహనం వ్యక్తం చేస్తున్నారా? లేక వ్యతిరేకత, అసంతృప్తి బాహ్య సమాజానికి తెలిసిపోతుందన్న అభద్రతతో వ్యవహరిస్తున్నారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు చేరువయ్యే విధంగా మమేకం అవ్వమంటే నాయకులు, ఎమ్మెల్యేల సమాధానాలు ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇదిలా ఉండగా మే 9 నుంచి 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేపడుతున్నారు. ప్రజల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకునేందుకు ఫోన్ లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ సేవల్లో సమస్యలు, సలహాలను నేరుగా చెప్పవచ్చు. ఈ కార్యక్రమాన్ని ఎటువంటి స్పందన వస్తుందో వేచి చూడాల్సిందే.



దాడి చేసిన వారిని శిక్షించాలి : నాదెండ్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలనలో దౌర్జన్యాలు దాడులు, గుండాయిజం పెరిగిపోయాయని, జనసేన సానుభూతి పరులపై దాడి చేసిన వారిని తీవ్రంగా శిక్షించాలని జన సేన పార్టీ పొలిటికల్ ఎఫైర్ కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ డిమాండ్ చేశారు. ఇటీవల వైసిపి నాయకులు,కార్యకర్తల చేతిలో దాడికి గురైై సర్వ జన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఆయన శనివారం పరామర్శించారు. దాడికి గల కారణాలు,వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చీపురుపల్లి నియోజకవర్గంలో అవినీతి పై ప్రశ్నించినందుకు, ఇళ్ల మంజూరులో రూ.30వేలు చొప్పున అధికార పార్టీ నాయకులు వసూలు చేస్తున్నారని గడప గడపకు వైసిపి కార్యక్రమంలో జన సేన సానుభూతి పరులు ప్రశ్నించినందుకు దాడి చేయడం అన్యాయమని అన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో సామాన్యులకు న్యాయం జరగడం లేదన్నారు. అనంతరం ఎస్‌పికి వినతి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.యశస్వి, గురాన అయ్యలు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వారిని పరామర్శిస్తున్న నాదెండ్ల మనోహర్

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు

సచివాలయ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం

ఎపిజెఎసి అమరావతి యూనియన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పోరాటంలో భాగంగా శనివారం కలెక్టరేట్ వద్ద గ్రామ సచివాలయ ఉద్యోగులు తమ సమస్యలపై ధర్నా చేశారు. ధర్నాలో ఆ సంఘం జిల్లా చైర్మన్ కెవి రమణరాజు, ప్రధాన కార్యదర్శి ఎ.విజయకుమార్, కోశాధికారి పివి పద్మనాభం మాట్లాడారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిఆర్ ఇంజినీరింగ్ ఉద్యోగ సంఘం నాయకులు టివి రమణమూర్తి, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అప్పలనాయుడు, పలుశాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి

ప్రజాశక్తి - వంగర

వేసవి సెలవుల్లో విద్యార్థులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని ప్రధానోపాధ్యాయులు ఎం రవణమ్మ, సురేష్ కుమార్ తెలిపారు. స్థానిక మండల కేంద్రంలో వంగర, శివ్వాం పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు ఇంటి వద్ద చేయవలసిన హోమ్‌వర్కుకు సంబంధించి సూచనలు ఇచ్చారు. ఈ ఏడాదిలో విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలలో సాధించిన మార్కులు, క్రమశిక్షణ ఎలా ఉన్నది అనేదానిపై ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు.

క్రాస్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్న ఎంపిపి గోపమ్మ

నీటిఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి-కొత్తవలస

తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అన్నారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద శనివారం క్రాష్‌ప్రోగ్రాంను ఎంపిపి, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి జెండా ఊపి పారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ క్రాష్‌ప్రోగ్రాం ద్వారా మరమ్మతులకు గురైన బోర్లను బాగుచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వై.పద్మజ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సన్యాసిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - భోగాపురం

ముక్కాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గుడివాడ శ్రీదేవి శనివారం విద్యార్థులకు ప్రోగ్రాస్ కార్డులు పంపిణీ చేశారు. ముందుగా తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఉయ్ లవ్ రీడింగ్, సమ్మర్ యాక్టివిటీస్, కెరియర్ గైడెన్స్ పై విద్యార్థులు శ్రద్ధ చూపేటట్లు తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసి చైర్‌పర్సన్ బడి నరసమ్మ, హెచ్.ఎం. గుడివాడ శ్రీదేవి, ఉపాధ్యాయులు పడాల చంద్రశేఖర్, కె.లక్ష్మణరావు, ఎస్. భవాని, ఎల్ పార్వతి దేవి, ఈ అనసూయ, ఆర్ శ్రీనివాసరావు, పి. సూర్యకాంతం, ఎం. గణపతి, బాలిపల్లి రఘు, సిఆర్‌పి మాత శేషుబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామాలయానికి రూ.లక్ష విరాళం

భోగాపురం : డెంకాడ మండలంలోని మోదవలస పంచాయతీ పరిధిలోని గొండయ్యపాలెంలో రామాలయ నిర్మాణానికి టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు రూ. లక్ష విరాళం అందించారు. శనివారం పోలిపల్లిలో తన స్వగృహంలో ఈ నగదును అందించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జిల్లా నాగవంశం అధ్యక్షులు ముని, ఎర్నింటి శ్రీనివాసరావు (గంట), ఎర్రుభోతు శ్రీను, కాళ్ళ శంకర్, సాయి, మనోజ్, గంగ, భాను, సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

శృంగవరపుకోట : మే 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పోలీసు అధికారులు, న్యాయవాదులను ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి కోరారు. ఎస్.కోట కోర్టులో న్యాయమూర్తి వాణి అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ పై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీ అవకాశమున్న క్రిమినల్, ఎస్‌టిసి కేసులను అప్పటికప్పుడు కాకుండా ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఎస్.కోట, జామి ఎస్‌ఐలు తారకేశ్వరరావు, వీరబాబుకు సూచించాంచారు. పోలీసులు కోర్టులో దాఖలు చేస్తున్న క్రిమినల్ కేసుల్లో ఆనవాయితీగా దొర్లుతున్న చిన్నపాటి లోపాలను సరి చేసుకోవాలని సూచించారు. సమీక్షలో సిఐ ఎస్.సింహాద్రినాయుడు, ఎస్.కోట బార్ అసోసియేషన్ కార్యదర్శి డబ్ల్యు.ఎన్.శర్మ, న్యాయవాదులు బి.త్రిమూర్తులు, మామిడి చంద్రశేఖర్, టివిఆర్ మూర్తి, ఆర్.సత్యనారాయణ జి.చిట్టిబాబు, బివిఎస్ రామారావు పాల్గొన్నారు.

వెంకన్నపేటలో ప్లాంటేషన్

ప్రజాశక్తి- డెంకాడ

ఎంవిజిఆర్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మండలంలోని వెంకన్నపేట గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం శనివారం ముగిసింది. ఇందులో భాగంగా గ్రామలంఓ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చిట్టిగుంకలాం ప్రాథమిక పాఠశాలలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మొక్కలు నాటడంతో పాటు పాఠశాల యాజమాన్యానికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ మోహన్ కుమార్, పిఒ ఎన్.షణ్ముఖరావు, చిట్టిగుంకలాం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గీతారాణి, గంగా భవాని, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

డెంకాడలో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి'

డెంకాడ : మండల కేంద్రంలో శనివారం మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ వైసిపి పాలనపై ప్రజలు విసుగు చెందారని రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిని డెంకాడ మండల అధ్యక్షులు పల్లె భాస్కరరావు, నాయకులు కలిదిండి పాణీరాజు, కొయనేని రమణ, బంటుపల్లి రామునాయుడు, ప్రదీప్ రాజు, కలిదిండి రంగరాజు, చలుమూరి మహేశ్, కోరాడ కుమారి, సబ్బవరపు పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాలువలు, సిసి రోడ్లు నిర్మించాలి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పెదతాడివాడ గ్రామంలో సిసి కాలువలు, రోడ్లు నిర్మించాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలో శనివారం గ్రామ సభను ఎంపిడిఒ డిడి స్వరూపరాణి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలో సిసి కాలువలు రోడ్లు నిర్మించాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామం పరిధిలో ఊడికలపేట, బేతనపల్లి, గుండాలపేట గ్రామాలు ఉన్నాయని ఈ గ్రామాల్లో పెరిగిన ఇళ్లకు అనుగుణంగా కాలువలు, రోడ్డు వేయాలని కోరారు. గ్రామ సరిహద్దుల్లో ఉన్న కాలువలు, గెడ్డను కొంతమంది ఆక్రమిస్తున్నారని వాటిని సర్వే చేసి గ్రామ అవసరాలకు, రెవెన్యూ అవసరాలకు వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు గాదిపల్లి రమేష్, పోంతపల్లి జగన్నాథం, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

మాది గ్రాఫిక్స్ ప్రభుత్వం కాదు

వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతిపక్ష నేత చంద్రబాబులా తమది గ్రాఫిక్స్ ప్రభుత్వం కాదని ఏదైనా చెబితే చూసి చూపించే ప్రభుత్వమని టిటిడి బోర్డు ఛైర్మన్, వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి ఉద్ఘాటించారు. శనివారం వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఉన్న ప్రత్యేక శ్రద్ధతో రూ.4,500 కోట్ల వ్యయంతో భోగాపురం అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులకు ఈ నెల 3న శంకుస్థాపన చేస్తారని తెలిపారు. రూ.23 కోట్లతో చింతపల్లిలో మత్స్యకారుల కోసం జట్టీ నిర్మాణంతో పాటు రూ.194 కోట్లతో తారకరామతీర్థ సాగర్ ప్రోజెక్టు నుంచి భోగాపురంలో ఎయిర్‌పోర్టుకు ప్రతీ రోజు 5 ఎంఎల్‌ఎడి, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5 లక్షల జనాభాకు ప్రతి రోజు తాగు నీటి సరఫరాకు, నెలిమర్ల నియోజకవర్గంలోని 24వేల ఎకరాలకు సాగు నీటిని సరఫరా చేసేందుకు అవసరమైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ భూ సేకరణ జరగక ముందే శంకుస్థాపన చేసిన టిడిపి నాయకులు చేష్టలు బూటకం కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు లా పూటకు ఒక మాట చెప్పే పార్టీ మాది కాదని అన్నారు. ఇప్పటి వరకు పెండింగ్లో ఉన్న బిల్లులు వారం రోజుల్లో క్లియర్ చేస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసి సుబ్బారెడ్డి; వేదికపై మంత్రులు బొత్స, బూడి ముత్యాలునాయుడు, రాజన్నదొర తదితరులు

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు సతీష్

క్వారీ తవ్వకాలకు అనుమతి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 7లో జి.సీతారాం, కె.వి రమణమూర్తి, వీలుపర్తి పంచాయతీ పెద్దదుంగాడ సర్వేనెంబర్ 45లో దివ్యాంజనేయ స్టోన్ క్రషర్ల ఏర్పాటుకు ఆయా గ్రామస్తులు ఆమోదం తెలిపారు. డిఆర్ఒ ఎం.గణపతిరావు ఆధ్వర్యాన శనివారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. సర్పంచులు, ఎంపిటిసిలతోపాటు ఆయా గ్రామస్తులు, మాట్లాడుతూ క్వారీలు నడుపుకునేందుకు ఏ విధమైన అభ్యంతరమూ లేదన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. సమావేశంలో జిల్లా మైన్స్ ఇఇ, తహశీల్దార్ కృష్ణంరాజు, సిఐ సింహాద్రి నాయుడు, ఎస్ఐ రాజేష్, వీలుపర్తి, సోంపురం సర్పంచులు సేనాపతి లీల, ఎం.గంగరాజు, పంచాయతీ కార్యదర్శులు అనూష, బి.నాగమణి, వైసిపి నాయకులు బీల సతీష్, తదితరులు పాల్గొన్నారు

మెగా పీపుల్ సర్వేకు స్పందన : ఎమ్మెల్యే బొత్స

ప్రజాశక్తి-గజపతినగరం

మెగా పీపుల్ సర్వేలో నియోజకవర్గంలో వైసిపికి అపూర్వ స్పందన లభిస్తుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో దోచుకో దాచుకో అనే పథకం ద్వారా భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ రైతుల సొమ్మును కాజేసిన మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు సెల్ఫీ ఛాలెంజ్ చాలా హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవాచేశారు. నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల నియామకం, బైపాస్ రోడ్డు నిర్మాణం, 30 పడకల ఆసుపత్రిని 50 పడకల ఏరియా ఆసుపత్రిగా మార్చి అభివృద్ధి చేసిన ఘనత తమదేనని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జెడ్‌పిటిసి గార తవుడు, ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, వైసిపి మండల అధ్యక్షులు బూడి.వెంకటరావు, సర్పంచులు బెల్లాన త్రినాధరావు, మండల.సురేష్ పాల్గొన్నారు.

ప్రజల మద్దతు మాకే

కొత్తవలస : ప్రజల మద్దతు వైసిపికే ఉందని, రెండోసారి అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. వైసిపి కార్యాలయంలో కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు అధ్యక్షతన శనివారం నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో 91 శాతం కుటుంబాలను కలిసినట్లు చెప్పారు. వైసిపిపై ప్రజలకు దృఢమైన విశ్వాసం ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు టి.విజయ్‌కుమార్, జీసిసి చైర్‌పర్సన్ స్వాతిరాణి, డిసిసిబి చైర్మన్ వి.వి.చినరామునాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ మూకల కస్తూరి, ఎంపిపిలు నీలంశెట్టి గోపమ్మ, గేదెల శ్రీనివాసరావు, దొగ్గ సత్యవంతుడు, ఎస్.అరుణ, జెడ్‌పిటిసిలు నెక్కల శ్రీదేవి, ఎస్.అప్పారావు, నాయకులు గొర్లె రవికుమార్, మమ్ములూరి జగన్నాథం, ఒబ్బిన నాయుడు, గుమ్మడి సత్యనారాయణ, మోపాడ కుమార్, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జులు బి.వెంకటరావు, వైస్ ఎంపిపి కర్రి శ్రీను పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స, ఎమ్మెల్సీ రఘురాజు

మేడేను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని కార్మికులకు సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, ఉపాధ్యక్షుడు రెడ్డి శంకరరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక 40 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులు హరిస్తున్నారని, ఎందరో ప్రాణత్యాగంతో సాధించుకున్న 8 గంటల పని దినం నేడు బిజెపి అధికారంలో ఉన్న గుజరాత్, రాజస్థాన్, రాష్ట్రాల్లో 12 గంటల పని దినంగా మారుస్తూ జీవోలు తెచ్చారని తెలిపారు. అంబాని, అదానీ చేతిలో మోడీ కీలుబొమ్మలుగా మారారని అన్నారు. ప్రపంచ కార్మిక వర్గ పోరాట దీక్షా దినం మేడే స్ఫూర్తి తో మోడి విధానాలు తిప్పి కొట్టాలనికార్మికులకు పిలుపు నిచ్చారు.మేడే రోజున డాబా తోట నుండి మహా ప్రదర్శన, కోట వద్ద భారీ బహిరంగ సభ జరుగుతుందని కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు నాయకులు సురేశ్, తది తరులు పాల్గొన్నారు.

ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి - వంగర

ఈ ఏడాది ఇంటర్మీడియట్‌లో ఫెయిలైన ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మే ఒకటి నుంచి 20 రోజులు పాటు మండలంలోని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కొరటాన నారాయణరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు నిర్వహిస్తున్న ఈ క్లాసులు ఉదయం ఎనిమిది గంటల నుంచి, మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయన్నారు. ప్రభుత్వ లేదా ప్రైవేటు కళాశాలలో ఈ ఏడాది చదివి ఫెయిలైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పన్నుల భారం మోపడం తగదు : సిఐటియు

నెల్లిమర్ల : నగర పంచాయతీ వాసులపై పన్నుల భారం మోపడం తగదని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు అన్నారు. శనివారం ఆయన జరజాపుపేటలో విలేకర్లతో మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధి లేదు సరి కదా పన్నుల భారం వేయడం దుర్మార్గమన్నారు. నగర పంచాయతీ వల్ల సుమారు 5000 మందికి ఉపాధి హామీ పనులు లేకుండా పోయాయన్నారు. పారిశుధ్య కార్మికులకు నెల నెల వేతనాలు ఇవ్వకపోవం బావ్యం కాదని అన్నారు. పారిశుధ్యం కార్మికులకు సక్రమంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఐటిఐ కాలనీ సమీపంలో ఉన్న ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిలో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చెప్పారు. ఇండోర్ స్టేడియం నిర్మాణానికి టిడిపి హయాంలో నిధులు మంజూరైన 25శాతం పనులు పూర్తి కాకపోవడంతో నిధులు వెనక్కి మళ్లాయన్నారు. ఇండోర్ స్టేడియం ఉన్న ప్రాంతంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేస్తామన్నారు. నిర్మిత కేంద్రం స్థలంలో ఆర్‌డిఒ కార్యాలయం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు ఆయనతో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, తహశీల్దార్ రాజారావు, తదితరులు ఉన్నారు.

టిడిపి ఆరోపణలు నిరాధారం : శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

సెల్ఫీ ఛాలెంజ్ పేరుతో టిడిపి చేస్తున్న ఆరోపణలో వాస్తవం లేదని, ప్రజల మద్దతు వైసిపికే ఉందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బొబ్బిలి నియోజకవర్గంలో ఈ నెల ఏడో తేది నుంచి జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి గత టిడిపి ప్రభుత్వం, ప్రస్తుత వైసిపి ప్రభుత్వ పాలనపై ప్రజలను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. 2024లో జరిగే ఎన్నికల్లో 'మీ మద్దతు వైసిపి' ఇస్తారా? అని అడగ్గా మద్దతు ఇస్తామని ఎక్కువ శాతం మంది చెబుతున్నారని వెల్లడించారు. నియోజకవర్గంలో 1.25 లక్షల కుటుంబాలను కలిసినట్లు చెప్పారు. ప్రతిపక్షాలు ఏకమై పోటీ చేసిన వైసిపి ఓడించలేరన్నారు. బొబ్బిలి అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత రాజులకు లేదన్నారు. వైసిపిని విమర్శించే అర్హత ఎవరికీ లేదని, చౌకబారు ఆరోపణలు మానుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో ఎంపిపిలు బి.గౌరీ, ఎన్.ఉమాలక్ష్మి, జెడ్‌పిటిసి పి.రామారావు, ఎఎంసి చైర్మన్ బి.శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, జెసిఎస్ కన్వీనర్లు విస్సు, దామోదర్ పాల్గొన్నారు.

సిఎం సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని సవరవల్లి పంచాయతీలో జరగనున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సభను విజయవంతం చేయాలని మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ కోరారు. శనివారం వెలుగు కార్యాలయంలో వెలుగు సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభకు పెద్ద ఎత్తున మహిళలను తరలించే బాధ్యతను చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ రాజ్ కుమార్, ఎంపిడిఒ బంగారయ్య, ఎపిఒ ఆదిబాబు, సిసిలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫించనుదారులకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ఫించనుదారులందరు ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా ఖజానా మరియు లెక్కల అధికారి ఆర్.ఎ.యస్.కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంతవరకు లైఫ్ సర్టిఫికేట్లు సమర్పించని ఫించనుదారులు తక్షణమే సంబంధిత ఉప ఖజానా అధికారి వారికి సమర్పించాలని కోరారు. ఇకెవైసి కూడా ఫించనుదారులు తక్షణమే హెర్బ యాప్ సహాయంతో గాని, సంబంధిత ఉప ఖజానా కార్యాలయంలోగాని వారి సిఎఫ్‌ఎమ్ఎస్ ఐడికి ఇకెవైసి చేయించుకోవాలని కోరారు.

రంగాపురంలో హౌసింగ్ డే

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని రంగాపురంలో హౌసింగ్ డే సందర్భంగా శనివారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ ఎఇ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రంగాపురంలో జగనన్న కాలనీలో మంజూరైన 80 గృహాలకు గాను 20 ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయని చెప్పారు. మరికొన్ని లెంటల్ లెవెల్ వరకు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి చంద్రకళ పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

వేపాడ : మండలంలో బక్కునాయుడుపేట వద్ద గల జగనన్న లేఅవుట్లు గృహాలు నిర్మిస్తున్న లబ్ధిదారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి సి.హెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ త్వరితగతిన గృహ నిర్మాణం పనులు చేపట్టి గృహప్రవేశానికి సిద్ధంగా ఉండాలని లబ్ధిదారులకు తెలిపారు ఈ సమావేశంలో హౌసింగ్ ఎఇ అప్పలనాయుడు, పిఆర్‌జెఇ ఆలి, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

అశోక్ చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


గడప గడపకూ కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో 1.45 కోట్ల ఇళ్లు ఉంటే.. 1.10 కోట్ల కుటుంబాలు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పట్ల తమ సంతృప్తి వ్యక్తం చేస్తూ 82960 82960 నంబర్ కు మిస్డ్ కాల్ ఇచ్చారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. శనివారం తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగేళ్ల పరిపాలన పూర్తయిన తర్వాత ఇంత ధైర్యంగా గతంలో ఏ ప్రభుత్వమూ ప్రజల వద్దకు వెళ్లలేదని గుర్తు చేశారు. తమ ప్రభుత్వంలో ఇతర రాజకీయ పార్టీల వారు సైతం సంక్షేమ పథకాల లబ్ధి పొందారని.. అమ్మఒడి, ఆసరా, చేయూత వంటి పథకాలు అందడంతో ఆ కుటుంబంలోని మహిళలు సంతోషంతో, స్వచ్ఛందంగా ' మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను తమ ఇళ్లకు అతికించేందుకు అంగీకరిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే ప్రస్తుతం పైసా కూడా అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాకు నగదు జమ అవుతుండడం పట్ల అధిక శాతం మంది హర్షం వ్యక్తం చేస్తున్నారని వివరించారు.

అవినీతి కోరుకునే వారికే అసంతృప్తి

ఈ ప్రభుత్వంలో ఎవరైనా అసంతృప్తిగా ఉన్నారంటే.. అది కేవలం అవినీతి, లంచగొండితనం కోరుకున్న వారేనని కోలగట్ల అన్నారు. ఈ సర్వే ప్రభుత్వ నిబద్ధతకు, జగన్ మీద ఉన్న విశ్వాసానికి నిదర్శనం అన్నారు. విజయనగరం నియోజకవర్గంలో 91,857 ఇళ్లకు గానూ 92.59 కుటుంబాలను నేరుగా కలిశామన్నారు. 72,956 కుటుంబాల నుంచి ప్రభుత్వం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. టిడిపి నాయకులు అశోక్ గజపతిరాజు సెల్ఫీ చాలెంజ్ లకు తాను స్పందించాల్సిన అవసరం లేదని కోలగట్ల అన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు ఇస్తున్న సెల్ఫీ చాలెంజ్ లకు ఆయన సమాధానం ఇచ్చుకుంటే చాలన్నారు. నంబర్ 2 స్థాయిలో ఉండి.. కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా పనిచేసిన ఆయన విజయనగరానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇద్దరమూ ఒకే వేదిక మీదకు వద్దామని. ఎవరు అభివృద్ధి చేశారో ప్రజలకు వివరించి, ఓటు అడుగుదామని.. అందుకు అశోక్ సిద్ధమేనా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

CHANGE OF NAME

Pentapati Santhi Lakshmi (Old Name) D/o **PENTAPATI KAMARAJU** resident of gandhi agencies, Door No : 6-7-76, chinna Veedhi, Vizianagaram Change my name from PENTAPATI SANTHI LAKSHMI (old name) to **PENTAPATI SANTHA LAKSHMI** (new name) hence forth i am being called as PENTAPATI SANTHA LAKSHMI for all purposes

IN THE HONOURABLE COURT OF THE 3rd ADDL JUNIOR CIVIL JUDGE CUM SPECIAL EXCISE MAGISTRATE AT VIZIANAGARAM
O.S. 301/2022 I.A. 145/2022

Between:
Yatla seethe @ seetharatnam
......Petitioner/plaintiff

And:
Smt. Kanchi Adilakshmi and others
......Respondents/Defendants

TO: -
DEFENDANT NO 4
Sri. Vadapalli Ramana, S/o late Seethanna, resident of Door No 7-10-39, Kantubuktha vari veedhi,,vizianagaram Town and District.

NOTICE

Please take notice that the above named plaintiff filed a suit against respondent/ defendants 1 to 3 and the defendant No 4 is tenant of the defendants 1 and 2, for partition of the plaint schedule properties into four shares and to allot one such share to her and defendant No 4 to 6 are directed to vacate the item No. 1 of the plaint schedule property and hand over vacant possession of the said property, and the same stands posted to **10.5.2023** on that day you have to appear before this Honourable court either personally or through an Advocate by **10.30 A.M** along with your documents failing which the matter will be decided in your absence as per Law.

MAJJI YOGESWARA RAO,
ADVOCATE,
VIZIANAGARAM.

నేరాలు ఘోరాలు

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి-రామభద్రపురం

వెంకటరమణ మృతదేహం

తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బుచ్చెంపేట గ్రామానికి చెందిన సాగి వెంకటరమణ (35) మండల పరిధిలోని పంతిమామిడి వలస వెళ్లే రహదారి సీతగుండం దగ్గరలో దారుణహత్యకు గురయ్యాడు. శనివారం మృతదేహాన్ని చూసిన వారు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సురేంద్ర నాయుడు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, ఆయన వద్దనున్న ఆధార్, తదితర వివరాల మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. అయితే ఆయనను ఇంత దారుణంగా ఎవరు హత్య చేశారు? ఎందుకు చేశారు? ఆ జిల్లా వాసి ఇక్కడకు ఎందుకు వచ్చాడు? అనే వివరాలు ఏమీ తెలియడం లేదని పోలీసులు చెబుతున్నారు. బంధువులు వస్తే పూర్తి వివరాలు, హత్యకు గల కారణాలు తెలిసే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఆయన తలపై బలమైన ఆయుధంతో కొట్టడం వల్ల ముఖమంతా ఛిద్రమైంది. ఎస్ఐ ఆధ్వర్యంలో మృతదేహానికి పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాణా సంచా తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం : ఒకరు మృతి

గుర్ల : మండలంలోని గవిడిపేటలో ఉన్న శ్రీ కనకదుర్గ ఫైర్ వర్క్సులో శనివారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో వాచ్‌మెన్ తమ్మగంటి సీతంనాయుడు మృతి చెందగా, రెండు షెడ్లు పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. పనివాళ్ళు, యజమాని వెళ్లి పోయిన తర్వాత వాచ్ మెన్ షెడ్లుకు తాళం వేసి వస్తున్న సమయంలో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. దీంతో సమీపంలో ఉన్న వాచ్ మెన్ భార్య తుమ్మగంటి సూరమ్మ గెడ్డ వైపునకు పారిపోవడంతో ప్రాణాలతో బయట పడింది. సీతంనాయుడు షెడ్ శిథిలాల కింద చిక్కుకొని మృతి చెందాడు. పేలుడు ధాటికి షెడ్ తలుపు రెక్కలు ఎగిరి అదే గ్రామానికి చెందిన గవిడి సూరమ్మ మెడకు తగిలింది. ఆమెను చికిత్స కోసం విజయనగరంలో ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించారు. సంఘటన స్థలాన్ని చీపురుపల్లి సిఐ సంజీవిరావు పరిశీలించారు. చీపురుపల్లి ఆర్‌డిఒ ఎం అప్పారావు, గుర్ల డిటి సూర్యనారాయణ రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ హరిబాబు నాయుడు సిబ్బందితో కలసి సంఘటన స్థలానికి చేరుకొని, చీపురుపల్లి అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మంటలను అదుపు చేశారు.

చీకటిపేటలో అగ్ని ప్రమాదం

తెర్లాం : మండలంలో చీకటిపేట గ్రామంలో శనివారం మూడు పశువుల శాలలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో చీకటి సింహాచలం, చిన్నంనాయుడు, లక్ష్మణరావు శాలలు కాలిపోయాయి. ట్రాక్టరుకు సంబంధించి కొంత సామగ్రి ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. పక్కన ఉన్న శాలలో చీకటి రఘుకి చెందిన కారుకు అగ్గి వేడి తగిలి అద్దాలు పగిలిపోయాయి. సంఘటనా స్థలానికి రెవెన్యూ సిబ్బంది చేరుకుని, రూ.60 వేలు ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేశారు.

చోరీకి పాల్పడిన ముగ్గురు మహిళలు అరెస్ట్

విజయనగరం: ఆటోలో ప్రయాణికులతో పాటు ప్రయాణించి చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు మహిళలను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. శుక్రవారం సాలూరుకు చెందిన బందపు కూర్మారావు తన భార్యతో బయలుదేరి విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో దిగి కాంప్లెక్స్ సమీపంలో ఆటో ఎక్కి సౌత్ ఇండియన్ షాపింగ్ మాల్ వద్ద దిగారు. హేండ్ బ్యాగ్ చూడగా అందులో రూ. 37500 పోయినట్లు బాధితులు టూటౌన్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశారు. పోలీసుల పిర్యాదులో కొత్తవలస 202 కాలనీకి చెందిన పాత నేరస్తుల ఫోటోలను చూపించగా అందులో ముగ్గురిని బాధితులు గుర్తించారు. దీంతో నిందితులు గంటా కాళేశ్వరి, మేకల రేవతి, ఆవుల పార్వతిని ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్‌లో పోలీసులు అదుపులోకి తీసుకుని దొంగిలించిన నగదును రికవరీ చేశారు.